సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 14 । డిసెంబర్ । 2024



నాయకత్వంలో మాస్టార్లుగా..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు నాయకత్వ శిక్షణ కొనసాగుతుంది. శనివారం మొదటి బ్యాచ్ శిక్షణ ముగియనుంది.

8లో ▸



చెరువు లీజును నిరసిస్తూ..

కొల్లేరు గ్రామం చెట్టున్నపాడులోని దేవస్థానం చెరువు లీజు, చేపల వేలం పాటల వివాదం పోలీస్ స్టేషన్‌కు చేరింది. గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

8లో ▸



సైబర్ నేరాలపై అవగాహన

ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా సమాజాన్ని జాగృతం చేసే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని ఏలూరు జిల్లా ఎస్పీ శివకిషోర్ అన్నారు.

8లో ▸

న్యూస్‌రీల్

గూడ్సు రైలు కదిలింది



ఉండి స్టేషన్‌లో ప్లాట్‌ఫాం

సాక్షి స్పందన

ఉండి: 'ప్రయాణికులను వేధిస్తున్న రైల్వే అధికారులు' శుక్రవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. ఉండి స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై కొద్దిరోజులుగా నిలిపి ఉంచిన గూడ్సు రైలును సాయంత్రం తరలించారు. దీనిపై రైల్వే ప్రయాణికుల సంఘం కార్యదర్శి సీహెచ్ బంగారావు హర్షం వ్యక్తం చేశారు.

24 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

భీమవరం (ప్రకాశంచౌక్): రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక రెవెన్యూ సదస్సులని, జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 6 నుంచి ప్రారంభమైన సదస్సులో జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుతో వారం రోజులు ఆలస్యంగా ప్రారంభించామన్నారు. జిల్లాలో జనవరి 08 వరకు సదస్సులు జరుగుతాయన్నారు. జిల్లాలోని 318 రెవెన్యూ గ్రామాలకు తొలి రోజు 24 గ్రామాల్లో సదస్సులు నిర్వహించి, 1,658 అర్జీలను స్వీకరించామన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాకెట్ సైన్స్‌పై అవగాహన



శాస్త్రవేత్తను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

తాడేపల్లిగూడెం: రాకెట్ సైన్సు ప్రాధాన్యత పెరిగిందని ఇస్రో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శుక్రవారం రాకెట్ సైన్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇస్రో విలువ పెరగడంతో పాటు, సైన్స్‌పై ఇప్పుడు ఎక్కువ మందికి ఆసక్తి పెరిగిందన్నారు. విద్యార్థులు ఇలాంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి కోస్తాంధ్రకు వర్ష సూచన

సాక్షి, విశాఖపట్నం: చలి తీవ్రత పెరిగే రోజులు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రంపై వర్ష ప్రభావం మళ్లీ ఉండబోతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు కలవరపరుస్తున్నాయి. దక్షిణ అండమాన్ సముద్రంపై నేడు ఉపరితల ఆవర్తనం ఏర్పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది 16 నాటికి అల్పపీడనంగా బలపడే అవకాశం ఉందని వెల్లడించారు. క్రమంగా దక్షిణ కోస్తా జిల్లాల వైపుగా కదులుతూ తమిళనాడు వైపు పయనించి.. అక్కడే తీరం దాటే సూచనలున్నాయని తెలిపారు. దీని ప్రభావంతో పాటు 17 తర్వాత.. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతాలు ఏర్పడేందుకు అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇవి కోస్తా జిల్లాలపై ప్రభావం చూపిస్తాయని.. ఫలితంగా 17న రాత్రి లేదా 18వ తేదీ నుంచి ఏపీ తీర ప్రాంత జిల్లాల్లో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు ఇటీవల ఏర్పడిన వాయుగుండం గాల్లో తేమనం తటినీ ఊడ్చెయ్యడంతో కోస్తాంధ్ర జిల్లాల్లో పొడి వాతావరణం నెలకొంది. ఫలితంగా రాత్రి సమయంలో సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదై ఉక్కపోత వాతావరణం ఉంది. ఈ పరిస్థితులకు ఇకపై చెక్ పడనుంది. అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడటం కారణంగా చలి తీవ్రత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోనున్నాయనీ.. చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు.

17న జాబ్‌మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరులో ఈనెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు డీఎల్‌టీసీ సహాయ సంచాలకుడు ఎస్.ఉగాది రవి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డీఎల్‌టీసీ/ ఐటీఐ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, సుమారు 100 మందికి ఉద్యోగావకాశాలు కలిస్తారన్నారు. వివరాలకు సెల్ 9493482414, 8919608183లో సంప్రదించాలని కోరారు.

రైతులకు అండగా.. ఉద్యమ బావుటా

పెట్టుబడి సాయం అందదు.. పంటలకు గిట్టుబాటు ధర లేదు.. కూటమి పాలనలో దళారులు రాజ్యమేలుతూ అన్నదాతను కుదేలు చేస్తున్నారు.. విపత్తుల వేళ సాయమందించాల్సిన సర్కారు దగా చేస్తూ బీమా భారం మోపింది.. పండుగలాంటి వ్యవసాయాన్ని దండగ అనే రీతిలో పాలిస్తూ కక్ష సాధిస్తోంది.. నిండా మునిగిన కర్షకులకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచింది. 'రైతుపోరు' పేరిట ఉద్యమ బావుటా ఎగురవేసింది.



భీమవరంలో రైతుపోరు ర్యాలీలో పాల్గొన్న రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కాలకూటమిపై పోరు

- వైఎస్సార్‌సీపీ 'రైతుపోరు'కు అనూహ్య స్పందన
- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలిన రైతులు, పార్టీ శ్రేణులు
- భీమవరంలో కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ
- రైతు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేత



భీమవరంలో కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, భీమవరం/ భీమవరం: అన్నదాతను అన్ని విధాలా ఆదుకుంటామని చేసిన వాగ్దానాలను విస్మరించి దగాకోరు పాలన సాగిస్తున్న కూటమి సర్కారుపై కర్షకులు కదం తొక్కారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ భీమవరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి పాలనలో దగాపడిన రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చిన 'రైతుపోరు' కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు జిల్లా కేంద్రమైన భీమవరానికి తరలివచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు నేతృత్వంలో విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి కలెక్టరేట్ వరకు కెనాల్ రోడ్డు వెంబడి రెండున్నర కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ సాగింది.

నినాదాలతో హోరెత్తుతూ..

ఎన్నికల్లో చెప్పినట్టుగా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, తొలకరిలో పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందించాలని, దళారీ వ్యవస్థను నిర్మూలించి కనీస మద్దతు ధర అందించాలని, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్ గేటు వద్ద రైతులనుద్దేశించి జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, ఉండి, పాలకొల్లు అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు పీవీఎల్ నరసింహరాజు, గుడాల శ్రీహరిగోపాలరావు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ తదితరులు ప్రసంగించారు. అనంతరం రైతు సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్‌లో డీఆర్వో మొగలి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఈబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్లు వేండ్ర వెంకటస్వామి, యడ్ల తాతాజీ, పార్టీ నేత గుణ్ణం నాగబాబు, భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నర్సింహరావు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు, పార్టీ నేత గాదిరాజు రామరాజు, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మద్దా చంద్రకళ, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, సమన్వయకర్తలు గూడూరి ఉమాబాల, పీవీఎల్ నరసింహరాజు, గుడాల గోపి

అన్నివర్గాలనూ మోసం చేసిన చంద్రబాబు

ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు



రైతులకు అండగా మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపు మేరకు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. రైతు అంటే గుర్తు వచ్చేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన బాటలో జగన్ కూడా గత ఐదేళ్లలో రైతు పక్షపాతిగా పనిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 10,500 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్స్యూరెన్స్ తదితర పథకాలు ఇచ్చి రైతుకు అండగా నిలిచారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు అన్నివర్గాల వారిని మోసం చేసి పాలన సాగిస్తున్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేసి బీమా ప్రీమియం భారాన్ని కూడా రైతులపై మోపారు. ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థకు చోటివ్వడంతో రైతులకు మద్దతు ధర అందడం లేదు. రూ.1,725లు బస్తాను (75 కిలోలు) దళారులు రూ.1,300 నుంచి రూ.1,400లకు కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారు. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కష్టాలు గుర్తించి వారి పక్షాన వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ఉంటుంది.

దళారీ వ్యవస్థతో అన్యాయం

కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి



కూటమి ప్రభుత్వం రూ.20 వేలు పెట్టుబడి సాయం ఊసెత్తడం లేదు. తుపాను ప్రభావంతో పంట నష్టపోయినా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. రూ.1,350 కోట్లు రైతులకు నష్టపరిహారం వచ్చేదానిని గాలికి వదిలేసింది. జగన్ పాలనలో అరెకరం ఉన్న రైతును కూడా గుర్తించి ఉచిత పంటల బీమా సౌకర్యం కల్పించారు. మిల్లుల వద్ద కూడా కస్టోడియన్ ఆఫీసర్లను నియమించి ధాన్యాన్ని సేకరించేవారు. నేడు దళారీ వ్యవస్థతో రైతులకు అన్యాయం చేస్తున్నారు. రైతులు నష్టపోతున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. సూపర్ సిక్స్ హామీలను ప్రజలు నమ్మి మోసపోయారు. హామీల ఊసెత్తకుండా సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు.

పంటలకు మద్దతు ధర లేదు

కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి



వ్యవసాయం దండగ అనే భావజాలంతో కూటమి ప్రభుత్వం ఉంది. జగన్ ప్రభుత్వంలో రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించేది. పంట నష్టాలు జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, సున్నావడ్డీ రుణాలు వంటి వాటితో ఆదుకున్నారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం సేకరించారు. రైతులకు మేలు చేసేలా కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలకు కూడా పాలసీలు రూపొందించి అమలుచేశారు. నేడు కూటమి ప్రభుత్వంలో పంటకు మద్దతు ధర దక్కడం లేదు. మిల్లర్లతో కుమ్మక్కై తేమ పేరుతో, రంగు మారిందన్న సాకుతో రైతులను దగా చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు.

రైతులను ఆదుకోవడంలో విఫలం

వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ



బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా తాము కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఆరు నెలల వరకు ప్రశ్నించలేదు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను బాధ్యతాయుతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వెన్నెముక లాంటి రైతులను ఆదుకోవడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వారికి రైతు భరోసా సాయాన్ని తక్షణమే అందించాలి. ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలి. లేకపోతే ప్రజలతో కలిసి నిరసనలు ఉధృతం చేస్తాం.

అన్నదాత సుఖీభవ మాటెత్తరే..

కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ



దేశానికి అన్నం పెట్టే రైతన్నను అన్నమో రామచంద్ర అనే పరిస్థితికి కూటమి ప్రభుత్వం తీసుకువచ్చింది. గత ప్రభుత్వంలో రైతు భరోసా రూ.13,500 ఇస్తే కూటమి నాయకులు రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ఒక్క రూపాయి ఇవ్వలేదు. ప్రజలు హామీల ఊసెత్తకుండా కూటమి నాయకులు ప్రతి నెలా ఒక్కో అంశాన్ని లేవనెత్తి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. రైతులతో పాటు మహిళలు, విద్యార్థులు ఇలా అన్నివర్గాలకూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది.

అన్ని వర్గాల మద్దతుతో పోరు

గూడూరి ఉమాబాల, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి



జగన్ పిలుపునందుకుని రైతులకు అండగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సీఎం చంద్రబాబు చేస్తున్న మోసానికి ప్రజలు బలయ్యారు. అబద్ధాలను నమ్మి ఓట్లు వేసి నష్టపోయిన ప్రజలు తిరిగి వారిని ప్రశ్నించలేరు. వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ప్రజాపక్షమే. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు, రైతులకు అండగా నిలిచి వారి పక్షాన పోరాడేందుకు తలపెట్టిన రైతు పోరుబాటకు అన్నివర్గాల వారు మద్దతు తెలిపారు.

సూపర్ సిక్స్‌ను గాలికొదిలేశారు

పీవీఎల్ నరసింహరాజు, ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి



కూటమి ప్రభుత్వం రైతులు, ప్రజలు, విద్యార్థులను మోసగించింది. ఎన్నికల్లో చెప్పిన మాటలకు అధికారంలోకి వచ్చాక చేస్తున్న పనులకు పొంతన లేదు. సూపర్ సిక్స్ హామీలను సీఎం చంద్రబాబు పూర్తిగా గాలికొదిలేశారు. భారీ వర్షాలు, వరదలతో రైతులు నష్టపోతున్నా పట్టించుకోవడం లేదు. పంటలకు కనీస మద్దతు ధర అందడం లేదు. రైతులకు వెంటనే రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి. రైతులు, పేదలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది.

ఇది మాటల ప్రభుత్వమే..

గుడాల గోపి, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి



ఎన్నికల హామీలను అమలుచేయకుండా కూటమి ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేస్తోంది. కూటమి ప్రభుత్వం మాటలే తప్ప చేతల్లో చూపడం లేదు. పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే అందించి రైతులను ఆదుకోవాలి. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు పూర్తి మద్దతు ధర అందించాలి. ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలి. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎల్లవేళలా వైఎస్సార్‌సీపీ పనిచేస్తుంది.

మరిన్ని పోరాటాలకు సిద్ధం

చెల్లెం ఆనంద ప్రకాష్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు



ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా వైఎస్సార్‌సీపీ ఇప్పటివరకు ఎలాంటి ఆందోళనలు చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. కూటమి నాయకుల మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఈ కార్యక్రమం నాంది మాత్రమే. రానున్న రోజుల్లో ప్రజాసమస్యలపై మరింతగా పోరాటాలు చేస్తాం.

మీడియాపై దాడులు దారుణం

తహసీల్దార్ల కార్యాలయాల వద్ద విలేకరుల నిరసన



తాడేపల్లిగూడెంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విలేకరులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, దాడుల నుంచి పాత్రికేయులను రక్షించాలని విలేకరులు గళమెత్తారు. కడప జిల్లా పులివెందులలో సాక్షి మీడియా ప్రతినిధి, హైదరాబాద్‌లో టీవీ9 ప్రతినిధిపై దాడులకు నిరసనగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపి తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. తాడేపల్లిగూడెంలో ఏపీయుడబ్ల్యూజే, జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి గజపతి ప్రసాద్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రంగ సురేష్ తదితరులు పాల్గొన్నారు. తణుకులో ఏరియా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కార్యదర్శి బెల్లంకొండ బుచ్చిబాబు, విలేకరులు పాల్గొన్నారు. పాలకొల్లులో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్ భవన్ నందు ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కేసుల పరిష్కారానికి అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు.

గోదావరి కాలుష్యంపై కేంద్ర బృందం తనిఖీ

నరసాపురం: నరసాపురం గోదావరి గట్టున దశాబ్దాలుగా చెత్తను డంప్ చేయడంపై సామాజికవేత్త ఓసూరి దేవేంద్రఫణికర్ జాతీయ కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం మండలి సౌత్‌జోన్ రీజినల్ డైరెక్టర్ హెచ్‌డీ వరలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటైన బృందం దర్యాప్తు చేపట్టారు. వరలక్ష్మితో పాటు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కేవీ రావు, శాస్త్రవేత్తలు సౌమ్య, సుకృతతో కూడిన బృందం పట్టణంలో విస్తృతంగా తనిఖీలు చేశారు. డంపింగ్ యార్డును పరిశీలించి స్థానికులు ఏ నీటిని తాగుతున్నారనే పలు విషయాలను ఆర్డీవో దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్యలను అడిగి తెలుసుకున్నారు. తానే 10 నిమిషాలు ఇక్కడ ఉండలేకపోతున్నానని.. జనం ఎలా బతుకుతున్నారని వరలక్ష్మి అసహనం వ్యక్తం చేశారు. గోదావరికి సమీపంలోని శ్మశాన వాటిక, ప్రైవేట్ స్కూల్‌ను పరిశీలించారు. పలువురు స్థానికులతో మాట్లాడారు. డంపింగ్ యార్డు ప్రాంతంలో మట్టిని, తాగునీటిని బృందం సేకరించింది. గాలి నాణ్యతను పరీక్షించేందుకు మూడుచోట్ల యంత్రాలు అమర్చారు. బృందం శనివారం కూడా తనిఖీలు చేయనుంది. పూర్తి నివేదికను ఢిల్లీలో తెలియజేస్తానని వరలక్ష్మి తెలిపారు.

విద్యుత్ చార్జీలపై నిరసన గళం



ఆకివీడులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆకివీడు: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలపై అదనపు భారాలు వేస్తోందని సీపీఎం ఆకివీడు ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా శుక్రవారం స్థానిక దొరగారి చెరువుగట్టు వద్ద ఉన్న గాంధీ విగ్రహం ఎదుట విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ ఛార్జీల్ని తగ్గిస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచారని మండిపడ్డారు. ప్రజలపై వేల కోట్లు భారం వేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో రూ.200 వచ్చిన విద్యుత్ బిల్లు ప్రస్తుతం రూ.800లు వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు పెంకి అప్పారావు, బీవీ వర్మ, బి.కల్యాణి, గేదెల ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

పెనుమంట్ర: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పెనుమంట్రలో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కోడే ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ బిల్లులు భారాన్ని మోపుతోందని ధ్వజమెత్తారు. తక్షణమే చార్జీలు తగ్గించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యవర్గ సభ్యులు కూసంపూడి సుబ్బరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విలువిద్యలో జయకేతనం



విలువిద్య పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

చింతలపూడి: రాజమండ్రి ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర కళాశాలల విలువిద్య పోటీలలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి టీం చాంపియన్ షిప్ సాధించారు. వ్యక్తిగత విభాగంలో వరుసగా గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించి ఆరుగురు విద్యార్థులు విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 24 నుంచి 27 వరకు భువనేశ్వర్‌లో జరిగే ఆలిండియా విశ్వవిద్యాలయాల ఆర్చరీ పోటీల్లో నన్నయ విశ్వవిద్యాలయం తరపున పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ డా పి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

బంగారు ఆభరణాల చోరీ

భీమవరం: ద్విచక్రవాహనం డిక్కీలో ఉంచిన బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. భీమవరం రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరామపురానికి చెందిన వి.అనూష బంగారు ఆభరణాలు బ్యాంకులో పెట్టి రుణం తీసుకునేందుకు చినఅమిరం పరిధిలోని ఓ బ్యాంకుకు శుక్రవారం వెళ్లింది. కొన్ని నగలను బ్యాంకులో పెట్టి రూ.5 లక్షలు రుణం తీసుకోగా, మిగిలిన రూ.8.50 లక్షలు విలువైన 120 గ్రాముల బంగారాన్ని స్కూటర్ డిక్కీలో పెట్టారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్ దగ్గర ద్విచక్రవాహనం నిలిపి జిరాక్స్‌లు తీసుకుని వచ్చేంతలో నగల సంచి మాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై రహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఖాళీగా ఉన్న పార్ట్ టైం డాక్టర్ (జనరల్), ఆయా (ఎస్టీ), ప్రాజెక్ట్ అసిస్టెంట్ (ఎస్సీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా మహిళాభివృద్ధి కార్యాలయం, కలెక్టరు ప్రాంగణం, రూమ్ నంబర్ 202లో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. పార్ట్ టైం డాక్టర్, ఆయా ఉద్యోగాలు మహిళలకు మాత్రమేనని తెలిపారు.

డ్రైవర్‌కు జైలుశిక్ష

నూజివీడు : కారు నిర్లక్ష్యంగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్ దేవతల శ్రీనివాసరావుకు మూడు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. 2019 ఫిబ్రవరి 21న రాజమండ్రి నుంచి 25 మంది మత్స్యకార కూలీలు భోజనం చేయడానికి హనుమాన్‌జంక్షన్ సమీపంలో ఉన్న బొమ్ములూరు వద్ద వ్యాన్ ఆపారు. నల్లమల గోపాలం రోడ్డు దాటుతుండగా ఏలూరు నుంచి వస్తున్న డ్రైవర్ శ్రీనివాసరావు కారును నిర్లక్ష్యంగా నడిపి గోపాలాన్ని ఢీకొట్టడంతో అతను మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నాయకత్వంలో మాస్టార్‌లుగా..

- సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాల నాయకత్వంపై శిక్షణ
- ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి 198 మంది హెచ్‌ఎంలకు శిక్షణ
- నేటితో మొదటి బ్యాచ్‌కు తరగతులు పూర్తి



లీడర్‌షిప్ శిక్షణలో ప్రధానోపాధ్యాయులు

నిడమర్రు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. అనేక సంస్కరణలతో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. దానిలో భాగంగానే గత ఏడాది ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ పేరుతో ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించింది. విద్యాశాఖ ఆ కార్యక్రమానికి కొనసాగింపుగా హెచ్‌ఎంలకు లీడర్‌షిప్ శిక్షణ-2 పేరుతో ఈ నెల 8 నుంచి భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శిక్షణ ప్రారంభించారు. శనివారంతో మొదటి బ్యాచ్ శిక్షణా తరగతులు ముగియనున్నాయి. ఈ శిక్షణా షెడ్యూల్, కోర్సును ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (ఏపీ సీమాట్) సంస్థ రూపొందించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 988 మంది హెచ్‌ఎంలకు రెసిడెన్షియల్/ నాన్ రెసిడెన్షియల్ విధానంలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. మొత్తం హెచ్‌ఎంలకు ఫిబ్రవరి నెలాఖరు వరకూ 5 విడతలుగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో శిక్షణ తరగతులు జరగనున్నాయి. ప్రతి బ్యాచ్‌కు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన 10 మంది మాస్టర్ ట్రైనీలు హాజరవుతారని డీఈవో నారాయణ తెలిపారు.

సమగ్రంగా.. సంపూర్ణంగా

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలు సమర్థవంతంగా నిర్వహించాలంటే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు తప్పనసరిగా దృఢమైన నాయకత్వ లక్షణాలు ఉండాలని విద్యాశాఖ ఆలోచన. శిక్షణ తూతూమంత్రంగా ఉండకుండా సమగ్రంగా.. సంపూర్ణంగా అందించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ జరుగుతుంది. ప్రతి బ్యాచ్‌కు 6 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. రెసిడెన్షియల్ హెచ్‌ఎంలకు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకూ, నాన్ రెసిడెన్షియల్ హెచ్‌ఎంలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకూ ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నారు.

శిక్షణలో అంశాలు

- వైకల్యం వంటి శారీరక లోపాలకు అతీతంగా బోధించడం
- పాఠశాల పరిస్థితుల అంచనా, వాటిని పరిష్కరించడం
- విద్యా వ్యవస్థలోని నూతన విధానాలను అందిపుచ్చుకోవడం
- పాఠశాలకు అందుతున్న వివిధ రకాల నిధుల వినియోగం
- విద్యార్థుల సామర్థ్యాలు, నైపుణ్యాల అభివృద్ధి
- సాంకేతిక విద్యా విధానం బోధను అందిపుచ్చుకోవడం
- తక్కువ వనరులతో ఎక్కువ ఫలితాలు
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తుల సహకారంతో ముందుకు సాగడం
- తరగతి గదుల్లో ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడి ప్రవర్తన
- విద్యాశాఖ రూపొందిస్తున్న వివిధ రకాల యాప్‌ల వినియోగం

సామర్థ్యాలకు సానబెడుతున్నాం



పాఠశాల నాయకత్వంపై హెచ్‌ఎంలకు ఇచ్చే శిక్షణలో వారిలో ఉండే సహజ సామర్థ్యాలకు అనుగుణంగా నాయకత్వాన్ని మరింత పెంపొందించేలా ప్రతీ హెచ్‌ఎంను సానబెడుతున్నాం, తద్వారా పాఠశాల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు వారే స్వతహగా పరిష్కరించుకోగలరు.
– ఈవీఎస్ఎస్ఎస్‌బీఎల్ నారాయణ, కోర్సు డైరెక్టర్, డీఈవో

నాయకత్వంపై మరింత పరిజ్ఞానం



మా పాఠశాలలో 1160 మంది విద్యార్థినిలు, 54 సిబ్బంది ఉన్నారు. వారందరిని సమన్వయం చేసేందుకు ఇలాంటి శిక్షణ ఎంతగానో ఉపయోగం. పాఠశాల నిర్వహణలో నాయకత్వంపై మరింత పరిజ్ఞానం పొందాం.
– జి.సునీత, హెచ్‌ఎం, కస్తూర్బా గరల్స్ హైస్కూల్, ఏలూరు

నాన్ రెసిడెన్షియల్ అవకాశం



ఈ ఫేజ్ లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో రెసిడెన్షియల్‌తోపాటు నాన్ రెసిడెన్షియల్‌కు అవకాశం ఇచ్చారు. దీంతో దూర ప్రాంతం వారికి శిక్షణా ప్రాంగణంలోనే అన్ని సౌకర్యాలతోపాటు వసతి ఏర్పాటు చేశాం.
– సీహెచ్ చంద్రశేఖర్, మెన్యూ ఇన్‌చార్జి, లీడర్‌షిప్ ప్రోగ్రాం

ఎవరికీ మినహాయింపు లేదు



హైస్కూల్, యూపీ, ఎల్‌ఎఫ్ఎల్, మోడల్, కేజీబీవీ, మున్సిపల్ స్కూల్స్, సోషల్ వెల్ఫేర్ స్కూల్స్‌లోని 988 మంది స్కూల్ హెడ్స్‌కు శిక్షణ అందిస్తున్నాం. ఏ ఒక్క హెచ్‌ఎంకు మినహాయింపులేదు.
– పి. శ్యామ్ సుందర్, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎస్ఎస్ఏ

జిల్లా	మొత్తం హెచ్‌ఎంలు	మొదటి బ్యాచ్‌లో
ఏలూరు	573	100
పశ్చిమగోదావరి	415	98
మొత్తం	988	198

చెరువు లీజును నిరసిస్తూ ఆందోళన



భీమడోలు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న చెట్టున్నపాడు వాసులు

భీమడోలు: కొల్లేరు గ్రామం చెట్టున్నపాడులోని దేవస్థానం చెరువు లీజు, చేపల వేలం పాటల వివాదం శుక్రవారం పోలీసు స్టేషన్‌కు చేరింది. గ్రామానికి చెందిన 18 మంది పెద్దలుగా చలామణి అవుతూ, ఇష్టానుసారంగా దేవస్థానం చెరువును లీజుకు ఇస్తూ.. కొల్లేరులోని చేపలకు వేలం పాటలు నిర్వహిస్తూ ఏటా కోట్లాది రూపాయలు మింగేస్తున్నారని, వారిని ప్రశ్నిస్తే తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ భీమడోలు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. దేవస్థానానికి చెందిన 80 ఎకరాల భూమి తవ్వకాలు తక్షణం నిలుపుదల చేయాలని, అక్కడ తవ్వకాలు చేస్తున్న ఆగడాలలంకకు చెందిన పాము వెంకటేశ్వరరావు, అతని మిషన్లను అక్కడ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రెండ్రోజుల కితం ఇదే విషయంపై పోలీసు స్టేషన్‌కు పిలిపించిన చిగురుపాటి రత్నాకర్ కనిపించడం లేదని, ఆతని ఆచూకీ తెలపాలంటూ వారు బైఠాయించారు. ఆందోళనకారులతో భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్‌లు చర్చించారు. సమస్య తమ పరిధిలోనిది కాదని, ఇతర శాఖల అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని సూచించారు. సంతృప్తి చెందని ఆందోళనకారులు వాగ్వాదానికి దిగారు. సీఐ స్పందిస్తూ చెట్టున్నపాడులోని చెరువు తవ్వక పనుల వల్ల శాంతిభద్రతల సమస్య తలెత్తే పరిస్థితి ఉందని, వెంటనే పనులు ఆపాలని సంబంధిత దేవస్థానం అధికారులను కోరారు. దీంతో పనులు నిలుపుదల చేశారు.

15న స్వర్ణకార సంఘ సమావేశం

ఆకివీడు: స్వర్ణకార వృత్తి పనివాళ్లకు బీసీ కార్పొరేషన్ నిధులు, ఇతర సంక్షేమ పథకాలు అమలుజేయాలని ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పట్నాల శేషగిరిరావు, నల్లగొండ వెంకట రామకృష్ణలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానికంగా సంఘ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ నెల 15న నర్సాపురంలో ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. స్వర్ణకార, విశ్వ బ్రాహ్మణుల సమస్యలపై చర్చించి, పరిష్కారం కోసం ప్రభుత్వానికి తీర్మానాలు పంపుతామని చెప్పారు. స్వర్ణకార ఫెడరేషన్‌లో సంఘ సభ్యుల్ని డైరెక్టర్లుగా నియమించాలని, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌లో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యుల్ని డైరెక్టర్లుగా నియమించాలని, దేవాలయ కమిటీల్లో విశ్వబ్రాహ్మణుల్ని డైరక్టర్లుగా నియమించాలని కోరతామన్నారు.

పట్టపగలే చోరీ.. నిందితుల అరెస్టు

అక్కిరెడ్డిపాలెం: పగటిపూట ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు క్రైం డీసీపీ కె.లతామాధురి తెలిపారు. గాజువాక సింహగిరికాలనీలో ఉంటున్న పుత్తిరెడ్డి కుసుమ కుమారి ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, ఆమె భర్త ప్రైవేట్ కాంట్రాక్ట్ వర్కర్. ఇంటి తాళాలను మెయిన్ డోర్ వద్ద షూ స్టాండ్‌లో ఉంచి విధులకు వెళ్తుంటారు. ఈ నెల 5న మధ్యాహ్నం ఇంటికి వచ్చినప్పుడు ఇంటి ప్రధాన తలుపు తెరిచి ఉండటం గమనించారు. బెడ్‌రూమ్‌లో బీరువా తెరిచి ఉండటం, అందులోని 20 తులాల బంగారు వస్తువులు, 25 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే గాజువాక క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు పరిశోధనకు ప్రత్యేక బృందం ఏర్పాటైంది. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా ప్రధాన నిందితుడైన జగదీష్‌ను అరెస్ట్ చేశారు. అతనికి సహకరించిన తణుకు నియోజకవర్గం పైడివాడలోని నాగేంద్రనగర్‌కు చెందిన ఇమ్మంది జ్యోతి శివను కూడా అరెస్ట్ చేశారు. వీరి నుంచి 25.7 తులాల బంగారం, 50.5 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో యావజ్జీవం

ఏలూరు (టూటౌన్): ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ ఏలూరు పోక్సో కోర్టు జడ్జి ఎస్.ఉమా సునంద శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసుకు సంబంధించి పోక్సో కోర్టు ఏపీపీలు తెలిపిన వివరాల ప్రకారం.. 2022 అక్టోబరు 8న దెందులూరులోని బాధిత బాలిక ఇంటి పక్కనే ఉన్న ముద్దాయి షాపునకు స్నాక్స్ కొనుక్కునేందుకు చిన్నారి వెళ్లింది. ఆ సమయంలో ముద్దాయి అంథోని రాజు బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత బాలిక విషయాన్ని నానమ్మకు చెప్పగా.. ఆమె దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై ఐ.వీర్రాజు కేసు నమోదు చేశారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జ్‌షీట్ ఫైలు చేశారు. కేసులో వాదనలు విన్న జడ్జి శుక్రవారం తుది తీర్పు వెలువరించారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఏలూరు(మెట్రో) : ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా సమాజాన్ని జాగ్రత్తం చేసే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా పోలీసులు, గ్రామదీప్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టూడెంట్ అంబాసిడర్ పబ్లిక్ సేఫ్టీ ట్రైనింగ్ వర్క్‌షాపును ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై అవగాహనతో ఉండాలని, సమాజంలో మరింత మందికి తెలియజేయాలని చెప్పారు. ఇంటర్‌నెట్‌లో జరిగే వ్యక్తిగత, ఆర్థిక, భద్రతాపరమైన సైబర్ నేరాలపై అవగాహన కలిగించాలన్నారు. తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు చెప్పరాదన్నారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, ఈ-మెయిల్ లింక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై 1930 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం అందించాలన్నారు. బాలికలపై అత్యాచారాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు ఉంటాయని, బాల్యవివాహాలు చేసే వారిపై, ప్రోత్సహించే వారిపై కూడా కఠిన చర్యలు ఉంటాయన్నారు. అవగాహన కార్యక్రమంలో 150 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో గ్రామదీప్ సంస్థ నిర్వాహకురాలు డా.మనోహరి, భూమిక సంస్థ లీగల్ అడ్వయిజర్ జి.అనుపమ, తెలుగు రాష్ట్రాల సోషల్ సర్వీస్ ప్రతినిధి కె.శాంతారాం, ఎస్ఈఆర్‌పీ ప్రతినిధి సి.ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికి బీమా సదుపాయం

దరఖాస్తుకు నేడు, రేపు అవకాశం

నూజివీడు: మామిడి రైతును నష్టాల బాట నుంచి తప్పించేందుకు ఈ పంటను వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలోకి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో రైతులు తమ మామిడి తోటలకు బీమా చేసేందుకు ఈ ఏడాది డిసెంబరు 15 వరకూ గడువుంది. బీమాతో జిల్లాలోని దాదాపు 40 వేల ఎకరాలకు సంబంధించిన మామిడి రైతులకు మేలు కలగనుంది. ఎకరాకు జీఎస్టీతో కలిపి రూ.2250 బీమా ప్రీమియంగా చెల్లించాలి. అలా చెల్లిస్తే ఎకరాకు రూ.45 వేలకు బీమా చేస్తారు. ప్రతికూల వాతావరణం వల్ల నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.45 వేలు చెల్లిస్తారు. ఆధార్, బ్యాంకు పాస్‌పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం, కౌలుదారు ధృవపత్రం పొందుపర్చాలి. ఈ ఏడాది డిసెంబరు 15 నుంచి 2024 మే 31 మధ్య వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో తేమ, గాలి వేగానికి సంబంధించిన పరిమాణాలను మండల స్థాయిలో ఉన్న ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ లెక్కించి తేడా ఆధారంగా నష్టపరిహారం చెల్లిస్తారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: ఉండి మండలం చినపుల్లేరులో 17 ఏళ్ళ బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాతయ్య ఇంటివద్ద ఉంటున్న బాలిక ఈ నెల 7న గ్రామంలో షష్ఠి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన అన్నసమారాధనకు కుటుంబీకులతో కలిసి వెళ్ళింది. కుటుంబీకులకంటే ముందుగా భోజనం చేసి ఇంటికి వెళ్ళిపోయింది. ఇంటికి వెళ్లి చూడగా బాలిక లేకపోవడంతో.. ఆచూకీ కోసం తెలిసిన వారి వద్ద వెదికారు. లాభం లేకపోవడంతో శుక్రవారం ఉండి పోలీసులకు బాలిక తాతయ్య ఫిర్యాదు చేశారు.

అన్నదాతల ఆందోళన




అత్తిలి ప్రాంతంలో ధాన్యం బస్తాలపై కప్పిన టార్పాలిన్‌లు

తుపాను ప్రభావంతో పంటను ఒబ్బిడి చేసుకునే పనుల్లో నిమగ్నమైన రైతాంగం




అత్తిలి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

అత్తిలి: తుపాను తగ్గి ఇప్పుడిప్పుడే మాసూళ్లు ముమ్మరం చేస్తున్న సమయంలో మళ్లీ వాతావరణం మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ ప్రకటనతో హడావుడిగా కోతలు కోస్తున్నారు. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకొని బస్తాల్లో నింపుతున్నారు. సార్వా మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. వరికోతలు ప్రారంభమైన తరువాత రెండోసారి వాతావరణశాఖ తుఫాన్ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులలో ఆందోళన నెలకొంది. అత్తిలి మండలంలో 14 వేల ఎకరాలలో సార్వాసాగు చేపట్టారు. 10 వేల ఎకరాలలో వరికోతలు పూర్తికాగా, 12 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించారు. బుధవారం ఆకాశం మేఘావృతంకావడంతో ఇటీవల నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు బస్తాలలో నింపి నెట్టెలు కట్టి, టార్పాలిన్‌లు కప్పుతున్నారు. చేలల్లో ఉన్న ధాన్యాన్ని ట్రాక్టర్లపై రోడ్డుపైకి చేర్చి రాశులుగా చేస్తున్నారు. వాతావరణం మబ్బుగా ఉండటంతో కొంతమంది రైతులు తడి ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయిస్తున్నారు. మరో వారం రోజుల పాటు వాతావరణం అనుకూలిస్తే సార్వా పంట ఒబ్బిడి అయ్యేదని, ఇంతలోనే తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో మాసూళ్లకు అంతరాయం ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్తిలి మండలంలో సార్వాసాగు ప్రారంభం నుంచి అన్నదాతకు కష్టాలే ఎదురౌతున్నాయి. సార్వానారుమళ్లు, నాట్లు సమయాలలో రెండు పర్యాయాలు యనమదుర్రు డ్రెయిన్ ఉధృత ప్రవాహానికి తిరుపతిపురం, వరిఘేడు, బల్లిపాడు, ఈడూరు, కొమ్మర, స్కిన్నెరపురం తదితర ఆయకట్టు ప్రాంతం ముంపుబారిన పడింది. మరలా నారుమళ్లు వేసుకుని నాట్లు వేశారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరలా ఇప్పుడు పంటచేతికందే సమయంలో తుఫాన్‌లు సంభవించడంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉంది రైతుల పరిస్థితి. వర్షాలు, వరదల ప్రభావంతో పంటదిగుబడి కూడా గణనీయంగా తగ్గడంతో రైతులకు, కౌలు రైతులకు ఆర్థికంగా నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా దాళ్వాసాగు పెట్టుబడి కోసం రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వం నుండి ఏవిధమైన పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు అప్పులు చేసి, సాగుచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

దోమ పుట్టుకను నిరోధించాలి



ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: సీజనల్ వ్యాధుల్లో భాగంగా మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులను వ్యాప్తి చేసే దోమల పుట్టుకను చెక్ పెట్టడంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ఖర్చురహితమైనదని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, పెరవలి రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ×ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. వారానికి ఒకసారి డ్రైడే పాటించడం ద్వారా దోమ పుట్టుకను నిరోధించవచ్చని, దోమల వ్యాప్తిని అరికట్టగలిగితే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని అన్నారు. ప్రజలు డ్రైన్‌లలో చెత్త వేయకుండా సహకరించాలని, జ్వరబాధితులు సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించాలని సొంత వైద్యం ప్రమాదకరమని వివరించారు.ఈ సందర్భంగా నంబరు 6 ఆకుల బుల్లబ్బాయి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు కె.చంద్రకళ, వార్డు హెల్త్ సెక్రటరీలు పి.కమలేశ్వరి, పి.మాధవి, ఆశా కార్యకర్త ఎస్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గౌరీదేవికి సారె సమర్పణ



పాలూరులో గౌరీదేవి అమ్మవారికి సారెను అందజేస్తున్న మహిళలు

అత్తిలి: మండలంలో పాలూరులో గౌరీదేవి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం అమ్మవారికి సారె ఉత్సవం ఘనంగా నిర్వహించారు. 30 రకాల స్వీట్లు, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, చీర, సారెలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): న్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నాయకులు విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు చార్జీల పేరుతో భారాన్ని మోపడం సరికాదని సీపీఎం జిల్లా సభ్యుడు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద విద్యుత్ బిల్లులు దగ్ధం చేసే కార్యక్రమం , నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని నినాదాలు చేశారు. విద్యుత్ అదనపు చార్జీలు ఉపసంహరించకోకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం పార్టీ కర్రెడ్ల రామకృష్ణ, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలో గుంటూరు పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వీకర్స్‌కాలనీలో శుక్రవారం మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆధ్వర్యంలో హలో మాల, చలో గుంటూరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగరాజు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన ఆదివారం సాయంత్రం 4 గంటలకు గుంటూరు సమీపంలోని నల్లపాడులో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని, చలో గుంటూరును విజయవంతం చేయాలని కోరారు. ఆవిష్కరణలో గుంపుల సత్యకృష్ణ, నామాల రాజు, సుందరరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ వెలగల సోమిరెడ్డి మృతికి సంతాపం

అత్తిలి: ఆరవల్లి గ్రామ మాజీ సర్పంచ్, రాజకీయ కురువృద్ధుడు వెలగల సోమిరెడ్డి (75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈయన శ్రీయోగివేమన జయంతి కమిటీ చైర్మన్‌గా పనిచేసారు. సోమిరెడ్డి తొలి ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎనిమిది సంవత్సరాల కాలంలో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సోమిరెడ్డి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పనిచేసి అజాత శత్రువుగా పేరుతెచ్చుకున్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజా ప్రతినిధులు హాజరై సోమిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి రాజగోపాల్ మృతి

తణుకు అర్బన్: ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి అయినపర్తి రాజగోపాల్ (66) గురువారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య విజయలక్ష్మితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సూర్యారావుపాలెం జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎంగా పదవీ విరమణ చేసిన ఆయన ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారని ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఏపీటీఎఫ్ నాయకులతో పాటు ఉపాధ్యాయ సంఘాలు ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

నాసిరకం ఆహారం విక్రయిస్తే చర్యలు

తాడేపల్లిగూడెం: హోటళ్లలో నాసిరకం ఆహారం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణంలోని హోటళ్ల యజమానులను కమిషనర్ ఎం.ఏసుబాబు హెచ్చరించారు. శుక్రవా రం ఆయన కార్యాలయంలో హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వినియోగించిన చర్యలు తప్పవన్నారు.

నేడు సాగు నీటి సంఘాలకు ఎన్నికలు

తణుకు టౌన్: తణుకు మండలంలోని సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసిల్దార్ డీవీఎస్ ఎస్ అశోక్ వర్మ తెలిపారు. తణుకు మండలంలోని మొత్తం 6 సాగునీటి సంఘాలకు ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని ఆయా సంఘాల పరిధిలోని అధికారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. శనివారం సాగునీటి సంఘాల సభ్యుల ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు, పరిశీలన, ఉప సంహరణ, అవసరమైతే ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తణుకు మండలంలో ముద్దాపురం, దువ్వ, తేతలి, మండపాక, తణుకు, వేమవరం సాగునీటి సంఘాలకు ఎన్నికలకు నిర్వహిస్తామన్నారు. తణుకు మండలంలోని గ్రామాల్లో మొత్తం 6 సాగునీటి వినియోగదారుల సంఘాలున్నాయి. వాటిలో మొత్తం 20,125 సాగునీటి వినియోగదారులు ఓటర్లుగా ఉన్నారు.

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషులత

తాడేపల్లిగూడెం రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎంపీపీ పానుకుమాటి శేషులత అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ శేషులత అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి దిశగా ముందుకు సాగాలన్నారు. తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ అంశంపై ఏడీఏ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఆర్‌ఎస్‌కేల ద్వారా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 99 శాతం కొనుగోళ్లు పూర్తయినట్లు తెలిపారు. ధాన్యం సొమ్ములు సైతం రెండు రోజుల వ్యవధిలో రైతుల ఖాతాకు జమ అవుతున్నాయన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి 1121 రకం వరి వంగడాన్ని ఆర్‌ఎస్‌కేల ద్వారా సరఫరా చేస్తున్నామని, రైతులు ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 164 హెక్టార్లలో నారుమడి పోసినట్లు వివరించారు. అలాగే మోడీ డ్రోన్ దీదీ పథకం కింద మండలంలో మూడు గ్రూపులు ఎంపికైనట్లు తెలిపారు. డ్రోన్ వినియోగంపై గుంటూరులో శిక్షణనివ్వనున్నారని, ఇంటర్ విద్యార్హత కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఇన్‌ఛార్జ్ ఏపీవో థామస్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీలక్ష్మి, ఆర్ అండ్ బీ రవిబాబు తదితర శాఖలపై సమీక్ష చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పి. సోమేశ్వరరావు, ఏఈ రాజా శ్రీనివాస్, ఎంఈవో వి.హనుమ, హౌసింగ్ ఏఈ కే.వెంకట్రావు, ఆర్‌టీసీ డీఎం వై. సత్యనారాయణమూర్తి, ఐసీడీఎస్, వైద్యులు, ఎమ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మీడియాపై దాడులను అరికట్టాలి



తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మీడియా ప్రతినిధులు

తణుకు టౌన్: రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, దాడుల నుంచి పాత్రికేయులకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కార్యదర్శి బెల్లంకొండ బుచ్చిబాబు డిమాండ్ చేశారు. కడప జిల్లా పులివెందులలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజీ కోసం వెళ్లిన సాక్షి మీడియా ప్రతినిధులపై దాడి చేసిన వారిపై, హైదరాబాద్‌లో టీవీ 9 ప్రతినిధిపై జరిగిన దాడులకు నిరసనగా శుక్రవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద తణుకు ఏరీయా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా భాస్కర్, జిల్లా పూర్వ కార్యదర్శి కొడమంచిలి కృష్ణ, తణుకు ప్రెస్ క్లబ్ పూర్వ కార్యదర్శి పంజా శివప్రసాద్, మీడియా ప్రతినిధులు టీ దొరబాబు, బీటీ వెంకటేశ్వరరావు, డీ శ్రీనివాసు, బీవీవీఎస్ రామ్ కుమార్, టీఎస్ఎన్ రెడ్డి, సతీష్, అగష్టీన్ బాబు, సత్య ప్రసాద్, శివ, నారాయణమూర్తి, బద్రీ, యూ చంద్రశేఖర్, డేగల మణికుమార్, ఉదయ కుమార్‌పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు బాధాకరం

తాడేపల్లిగూడెం: జర్నలిస్టులపై విచక్షణ రహితంగా దాడులు చేయడం బాధాకరమని ఏపీయుడబ్ల్యూజే, జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగిన నిరసన కార్యక్రమంలో వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి గజపతి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో టీవీ9, సాక్షి పాత్రికేయులపై దాడులు చేయడం సరికాదన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రంగ సురేష్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు చేసిన వారిని కాపాడే విధంగా ప్రభుత్వాలు వ్యవహరించడం సరికాదన్నారు. దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి గొలిమే బుజ్జిబాబు, కోశాధికారి శీలి రాజు, క్లబ్ మాజీ అధ్యక్షుడు చిక్కాల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌వి.లక్ష్మయ్య, యడ్లపల్లి మురళీకృష్ణ, షేక్ ఖాదర్, కొడమంచిలి ఆశీర్వాదం, కెవి.కృష్ణారావు, బూర్గుల భానుశ్రీనివాసు, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం



తణుకులో రైతుసమస్యలపై భీమవరం కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్తున్న మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు



విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీసీఎం కొట్టు సత్యనారాయణ

మాజీ మంత్రులు కొట్టు, కారుమూరి

తణుకు అర్బన్: రైతాంగాన్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు భీమవరం కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి తణుకు నుంచి భారీ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ హయాంలో రైతాంగం శ్రేయస్సు కోసం ఆర్‌బీకేలు ఏర్పాటుచేసి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి కిట్టుబాటు ధర కల్పించారని, కానీ నేడు రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు. వర్షాలకు ధాన్యం తడిచి ఇబ్బందులు పడిన సందర్భంలో రైతులు దళారులు ఇచ్చిన ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వచ్చిందని దుయ్యబట్టారు. పంట బీమా సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం చేయలేదని, రైతు భరోసా రూ. 20వేలు ఇస్తానని చెప్పి 6 నెలలు గడిచినా ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. అన్నం పెడుతున్న రైతును నిర్లక్ష్యం చేస్తే ఏపీలో కరువుకాటకాలు తలెత్తుతాయని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణంతో పాటు తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల నుంచి 105 కార్లలో 500 మంది భీమవరంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, కరిబండి రాజేష్, జల్లూరి జగదీష్, గారపాటి సత్యనారాయణ, రేలంగి రాంబాబు, పైబోయిన ఏసుబాబు, బొల్లా దుర్గాప్రసాద్, నున్న దుర్గాప్రసాద్, చింతన్న, మండ సూరిబాబు, రంభ నాగేశ్వరరావు, కర్రి గంగాధర అప్పారావు, పార్థసారధి, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసింది

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులను ఏ విధంగా మోసం చేస్తుందో ప్రత్యక్షంగా కనిపిస్తుందని మాజీ డిప్యూటీసీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన నివాసం వద్ద విలేకర్లతో మాట్లాడారు. చేతికొచ్చిన ధాన్యం అమ్ముకోడానికి సరైన ధర లేక రైతులు నష్టపోయిన పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరిగింది. రైతులకు ఇంతవరకు ఇన్‌పుట్ సబ్సిడీ రాలేదు. గత ప్రభుత్వంలో సిద్ధంగా ఉంచిన సున్నా వడ్డీని కూడా రైతులకు ఈ ప్రభుత్వం ఇవ్వలేదు. దుర్మార్గపు ఆలోచనతో, తమను ఏమీ చేయలేమనే భావనతో కూటమి ప్రభుత్వం ఉంది. ప్రభుత్వం మీద వత్తిడి తెచ్చి రైతులకు న్యాయం చేసేలా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూవివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



అత్తిలి:పాలి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ దశిక వంశీ



తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాయపాలెం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీల్ కుమార్

అత్తిలి: భూ వివాదాల పరిష్కారానికి గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులే వేదికలని తహసీల్దార్ దశిక వంశీ అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం పాలి, కె సముద్రపుగట్టు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరైనా బలవంతంగా భూమిని లాక్కుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రైవేటు భూములు ప్రభుత్వ భూములుగా మారితే వాటిని తిరిగి ప్రైవేటు భూములుగా మార్పుచేస్తామని తెలిపారు. భూముల్లో హెచ్చుతగ్గులు ఉంటే పరస్పర అంగీకారంతో సవరించుకోవాలన్నారు. రెవెన్యూపరమైన ఎటువంటి సమస్యనైనా పరిష్కారానికి తాము అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థాయి అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 121 ఫిర్యాదులు

తణుకు టౌన్: మండలం కొమరవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సదస్సులలో మొత్తం 121 ఫిర్యాదులు వచ్చినట్లు తహసిల్దార్ డీవీఎస్ ఎస్ అశోక్ వర్మ తెలిపారు. శుక్రవారం కొమరవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలకు సంబంధించి గ్రామస్థుల నుంచి 121 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ సదస్సులు

తాడేపల్లిగూడెం రూరల్: భూసమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ సదస్సులని తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న పట్టాదారు పాస్ పుస్తకం, ఆన్‌లైన్ తదితర భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో అర్జీల ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ రెవెన్యూ సదస్సుకు 14 అర్జీలు అందాయని తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బేతపూడి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ బేతపూడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వై. కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి



తాడేపల్లిగూడెం రూరల్: శిక్షణ కార్యక్రమంలో మహాత్మాగాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో విశ్వనాథ్



తణుకు టౌన్: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ జీ రమణ

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో సుస్థిర అభివృద్ధి ప్రణాళికపై రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ 2030వ సంవత్సరం నాటికి ప్రభుత్వం నిర్దేశించిన 9 తొమ్మిది లక్ష్యాలు, 2047వ సంవత్సరం నాటికి 17 లక్ష్యాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను గురించి సచివాలయ సిబ్బందికి వివరించారు. ఎంపీపీ శేషులత, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజా శ్రీనివాస్, బ్లాక్ లెవల్ మాస్టర్ ట్రయినీ రవిచంద్ర, జి. వెంకటేశ్వరరావు, కే. శ్రీదేవి, సీహెచ్. ప్రసాద్, జి.లక్ష్మి, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్ పాల్గొన్నారు.



ఇరగవరం: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్



అత్తిలి: మాట్లాడుతున్న తాడేపల్లిగూడెం డీఎల్‌డీఓ ఏఓ టి శేషగిరి

ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు చేరాలి

అత్తిలి: పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల ద్వారా అర్హులకు మేలు చేకూరేలా గ్రామ పంచాయతీలు ప్రణాళికలు రూపొందించుకోవాలని తాడేపల్లిగూడెం డీఎల్‌డీఓ కార్యాలయ ఏఓ టి శేషగిరి అన్నారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై తొలివిడత శిక్షణ తరగతులు ముగిసాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం శ్రీనివాసరావు, మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధిపై సమగ్ర శిక్షణ

తణుకు టౌన్: తణుకు మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు గ్రామ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న ఎల్ఎస్‌డీజీల శిక్షణ కార్యక్రమాలను ఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ జీ రమణ పరిశీలించారు. శుక్రవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శిలకు నిర్వహిస్తున్న ఈశిక్షణ కార్యక్రమాలను పరిశీలించి గ్రామాలు, మండల సుస్థిర అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ లోహిత్ జయసాగర్, ఈవోపీఆర్‌డీ పీవీ వీఎస్‌రామ్‌ప్రసాద్, ఏవో వీ కృష్ణచంద్రరావు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై అధికారులకు శిక్షణ

ఇరగవరం: స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యకర్తులకు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండురోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అధికారులకు గ్రామాల్లో సాధించాల్సిన అభివృద్ధిపై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలపై శిక్షణనిస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్ తెలిపారు. పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, శక్తివనరులు, హందాతనంతో కూడిన పని, ఆర్థికాభివృద్ధి, సుస్థిరమైన నగరాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు శిక్షణ ఇచ్చారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్స్ క్రిస్మస్ వేడుకలు

తణుకు టౌన్: తణుకు యునైటెడ్ పాస్టర్స్, ప్రీచర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన తణుకు మండల పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు గురువారం తణుకులో ఘనంగా జరిగాయి. తణుకులోని ఆదివారం సంత వద్ద గల పెంతుకోస్తు చర్చి ఆవరణలో జరిగిన ఈ వేడుకలలో పాస్టర్ జోనాల్ రివైవల్ క్రిస్మస్ ప్రసంగం చేశారు. పెలోషిప్ గౌరవ అధ్యక్షుడు ఎం హేరత్ బాబు, పీడీ ప్రసన్న కుమార్, అధ్యక్షుడు ఎం.యేసురత్నం, ఉపాధ్యక్షుడు వైఎస్ రాజు, ఎన్ఎస్ ప్రసాద్, కార్యదర్శి వై జయబాబు, కోశాధికారి కె సైమన్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.